ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మండలంలోని డోకులూరు పంచాయతీ డుమ్మాపుట్టు గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిభిరంలో 35 మంది పాడి రైతులు పశువులకు చికిత్సలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ లైవ్ స్టాక్ అధికారి కె.సురేష్ మాట్లాడుతూ, పశువులకు చర్మ వ్యాధి నివారణ టీకాలు, 295 మేకలు, గొర్రెలకు పిపిఆర్ నివారణ టీకాలు, నాటు కోళ్లకు డి వార్మింగ్ మందు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రైతులకు పలు సూచనలు చేశారు. పాడి పశువులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ కొండబాబు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న సురేష్

చైతన్యపూరితం.. ఉక్కు రక్షణ యాత్ర

-ఏడో రోజూ జననీరాజనం

-అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో ఎక్కడికక్కడ సాదర స్వాగతం

-స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతోనే ఉత్తరాంధ్ర ప్రగతి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

పాడేరులో అల్లూరి విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, అప్పలనర్స

సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20న విశాఖలో ప్రారంభమైన ఉక్కు రక్షణ బైకు యాత్ర మంగళవారం అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో ప్రజలను చైతన్యపరుస్తూ సాగింది. అల్లూరి జిల్లాలోని పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, పాయకరావుపేట మండలాల్లో ఏడో రోజు ఈ యాత్ర కొనసాగగా ప్రజలు అడుగడుగునా సాదర స్వాగతం పలికారు. యాత్రా బృందానికి కుంకుమ దిద్ది, హారతులిచ్చి.. తాము ఉక్కు పోరాటంలో భాగస్వాములవుతాయని ప్రతినబూనారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఇతర నాయకులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, విలేకరుల బృందం

బలమైన ప్రజా పోరాటాలతో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, రైల్వే, ఎల్‌ఐసి ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెడుతున్న మోడీ ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలన్నారు. స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు సిపిఎం చేపట్టిన బైక్ యాత్ర మంగళవారం సాయంత్రం పాయకరావుపేట చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మాట్లాడకుండా మోడీకి ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కు సాధన కోసం నాడు సిపిఎం పాయకరావుపేట ఎమ్మెల్యే మండే పిచ్చయ్య రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పిచ్చయ్య ఉద్యమ స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతుగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు ఎమ్మెల్యేలు, ఎంపీలు నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. దేశభక్తి ముసుగులో ప్రభుత్వ పరిశ్రమలను అమ్మకానికి పెట్టి, అదానీ, అంబానీ ఆస్తులను పెంచుతున్నారని అన్నారు. లక్ష మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోలేకపోతే ఉత్తరాంధ్రకు అన్యాయం జరుగుతుందన్నారు. మండల పెన్షనర్ల సంఘం నాయకులు వెంకటరమణ, డాక్టర్ గణపతి, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని పోరాటాలతో అడ్డుకోవాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలు తప్ప ఏ రాజకీయ పార్టీ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడ్డంలేదని అన్నారు. ఈ సభలో సిపిఎం నాయకులు జగన్, రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, పద్మ, శ్రీను, రాము, బత్తిన నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

కళాకారులతో కలిసి ఆడిపాడుతున్న నేతలు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

హుకుంపేట : మండలంలో బైకు యాత్ర ఉత్సాహంగా సాగింది. పోరాట యోధులు అల్లూరి సీతారామరాజు, మర్రి కామయ్య, సిపిఎం నాయకులు సొంటేన పుణ్యారావు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో యాత్రా బృందంతో పాటు హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, సిపిఎం జిల్లా నాయకులు హైమావతి, మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణరావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు చిన్నంనాయుడు, సత్యనారాయణ, సిపిఎం మండల నాయకులు పాంగి సోమన్న, టి.కృష్ణారావు, తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, కొంతిలి వైస్ సర్పంచ్ దూరు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చింతపల్లి : స్థానికంగా జరిగిన బైకు యాత్రలో నాయకులు మాట్లాడుతూ గిరిజన చట్టాలను ఎలా తుంగలో తొక్కుతున్నారో వివరించారు. ఆదివాసీలకు నష్టం చేకూర్చేలా హైడ్రో పవర్ ప్రాజెక్టులను తీసుకొస్తున్నారన్నారు. డిగ్రీ కాలేజ్ నుంచి యాత్ర ఉత్తేజపూరితంగా సాగింది. అనంతరం పాత బస్‌స్టాండ్ ఆవరణలో ఉన్న అల్లూరి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్, మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్. జికె.విధి మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు. కొయ్యూరు మండల నాయకులు వై.అప్పలనాయుడు పాల్గొన్నారు. అనంతరం యాత్ర కొయ్యూరు మండలం తురుబడిగడ్డ మీదుగా నర్సీపట్నంలోకి ప్రవేశించింది.

జి.మాడుగుల : మండలంలో సాగిన బైకు యాత్రకు అపూర్వ స్పందన లభించింది.

మన్యంలో ఉవ్వెత్తున సాగిన యాత్ర

పాడేరు : ఉక్కు రక్షణ బైక్ యాత్ర అల్లూరి జిల్లాలో సోమ, మంగళవారాల్లో ఉవ్వెత్తున సాగింది. అనంతగిరి నుంచి చింతపల్లి మండలం వరకు ఏడు మండల కేంద్రాల మీదుగా సాగిన ఈ ఉక్కు రక్షణ యాత్రకు విద్యార్థి, కార్మికలోకం, సిపిఎం, గిరిజన సంఘాలు ఘన స్వాగతం పలికాయి. తమ ద్విచక్ర వాహనాలతో యువత కదిలిరావడంతో మన్యంలో ఉక్కు నూతనోత్తేజం కనిపించింది. మంగళవారం ఉదయం అరకులో ప్రారంభమైన ఈ యాత్ర మండల కేంద్రాల మీదుగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు 10 గంటలకు చేరింది. సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్సతోపాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్, ఎల్.సుందరరావు, పాలికి లక్కు, ఐద్వా నాయకులు హైమావతి తదితరులు యాత్రలో భాగస్వాములయ్యారు. ఐటిడిఎ, ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్‌లో ప్రజానాట్య మండలి కళాకారులు ఉక్కు పరిరక్షణకు ఉద్యమించాలని ప్రజలను చైతన్య పరుస్తూ పలు గీతాలు ఆలపించారు. అవి ఉత్తేజపరిచాయి. పాడేరు పురవీధుల్లో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సుంద్రు పుట్టు మెయిన్ రోడ్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ సాగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని పెద్ద పెట్టున యాత్ర ఆద్యంతం నినదించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉన్న స్వాతంత్ర సమర యోధులు అల్లూరి సీతారామరాజు, గంటం దొర, అంబేద్కర్ విగ్రహాలకు సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జి.మాడుగుల, చింతపల్లి మండల కేంద్రాల మీదుగా లంబసింగి, డౌనూరు వరకు ఉక్కు రక్షణ యాత్రను కొనసాగించారు. పాడేరులో జరిగిన సభలో లోకనాథం, అప్పలనర్స మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. మోడీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రజాప్రతినిధులు ఆదివాసీలను ఎలా మోసగిస్తున్నారో వివరించారు. ముఖ్యంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ట్రైబల్ అడ్వైజరీ కమిటీతో సంబంధం లేదని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారని, చట్టాల గురించి ఆమె తెలుసుకోవాలని, గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. పాడేరు పేరుకే జిల్లా కేంద్రమని, అభివృద్ధి పగటి కలగానే మిగిలిందని అన్నారు. అక్టోబర్ 5న ఉక్కునగరంలో జరిగే ఉక్కు రక్షణ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిన్నయ్య పడాల్, ధర్మన్న పడాల్, పొద్దు బాలదేవ్, హైమావతి, పాలికి లక్కు, సుందరరావు, ప్రభుదాస్, పి.చిన్నారావు, వంతల దాసు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత వెంకట్, కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు గ్రామ పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం చింతూరు గ్రామ సచివాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య, ఇతర కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు రక్షణ గ్లౌజులు, షూలు, యూనిఫామ్స్ ఇవ్వాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇఒపిఆర్‌డికి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు యోహాను, ప్రభు, లక్ష్మయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్వేయర్ నాగార్జున

ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక

సర్వేయర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక గంగవరం మండలంలోని జగ్గంపాలెం గ్రామ సర్వేయర్ ఈ.నాగార్జున మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని స్థానికులు గుర్తించి గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తోటి సర్వేయర్ల తెలిపిన వివరాలు ప్రకారం... సర్వేయర్ నాగార్జున నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకున్నారు. నీరసంగా ఉండటంతో ఆయన ఒకరోజు విధులకు హాజరు కాలేదు. దీంతో సంబంధిత పైస్థాయి అధికారి నీ యొక్క సర్వీస్ రిజిస్టర్ తీసుకొని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ముందు హాజరుకావాలని చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన నాగార్జున ఆత్మహత్యకు యత్నించాడు. ఐదు నెలలుగా రంపచోడవరం డివిజన్‌లోని అన్ని మండలాల్లో సర్వేయర్ల మీద అధికారులు తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని, ఉదయం 8 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు విధులు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నారని తోటి సర్వేయర్లు మండిపడుతున్నారు. అనారోగ్యానికి గురైనా, అత్యవసర పరిస్థితులపై ఇంటికి వెళ్లవలసి వచ్చినా కనీసం సెలవు కూడా మంజూరు చేయటం లేదని అంటున్నారు. సెలవు మంజూరు కావాలంటే పంచాయతీ సెక్రెటరీ, మండల సర్వేయర్, తహశీల్దారును సంప్రదించాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీని కారణంగానే నాగార్జున ఆత్మహత్యకు పాలుపడ్డారని సర్వేయర్లు ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితి అయితే సబ్ కలెక్టర్ అనుమతి తీసుకోవాలని నానా రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని కారణంగానే నాగార్జున మంగళవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో దశ అడ్మిషన్లు

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు మూడవ దశ అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్న మాణిక్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27, 28 తేదీలలో మూడవ దశ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. తమ కళాశాలలో బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బిఏ ఆనర్స్ ఎకనామిక్స్ కోర్సు, బీకాం ఆనర్స్ జనరల్ (మైనర్ కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బియస్సి ఆనర్స్ జంతు శాస్త్రం, బియస్సి ఆనర్స్ రసాయన శాస్త్రం తదితర డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మొదటి, రెండవ దశలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన తమ విద్యార్థులకు అందించబడుతుందని స్పష్టం చేశారు. డిగ్రీ కోర్సుల విద్యా బోధనతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని వెల్లడించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే ప్రక్రియను స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు మంగళవారం పర్యవేక్షించారు. మండలంలోని శరభవరం పంచాయతీ సచివాలయం పరిధిలో జరుగుతున్న ఇంటింటా సర్వేపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరుపై గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్షపై అత్యవసర సమావేశం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో లోకల యాదగిరిశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలంలోని అక్టోబర్ 3 నుండి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం జరిగేలా ఈ సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి అంగన్వాడీలు, సర్పంచులు, ఎంపిటీసీలు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఇంటింటి ఆరోగ్య సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు

ముంచంగిపుట్టులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో వర్షం పడిన ప్రతిసారి కాలువల నుంచి ఒక్కసారిగా నీరు రోడ్లపైకి ప్రవహిస్తుంది. ముఖ్యంగా నాలుగు రోడ్ల కూడలి నుంచి సుజనకోట వెళ్లే రహదారిలో డ్రైనేజి మరింత దయనీయంగా మారింది. మందుబాబులు సేవించిన మద్యం సీసాలు, వివిధ ప్లాస్టిక్ బాస్టిల్స్, బురద వంటి చెత్త చెదరమంతా డ్రైనేజిలో పేరుకుపోయింది. దీంతో అటుగా రాకపోకలు సాగించిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

పెదబయలు: మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. పంట పోలాల్లో నిండుగా నీరు చేరింది. మెయిన్ రోడ్డుపై డ్రైనేజి లేక ఇళ్లల్లోకి బురదనీరు చేరింది. విద్యుత్ అంత రాయం ఏర్పడింది. బయోమెట్రిక్ హాజరుకు అవస్థలు పడ్డారు.

పంటల తెగుళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

అగ్గి తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -హుకుంపేట: వరి పంటలో అగ్గి తెగులు ఆశించి పంటను తీవ్ర నష్టపరుస్తుందని తగిన జాగ్రత్తలు పాటించాలని రైతులకు శాస్త్రవేత్త చిట్టిబాబు సూచించారు. మండలంలోని సత్రాయి పుట్టు, సుకూరు గ్రామాల్లో ఏరువాకలో భాగంగా వ్యవసాయ అధికారులు లీలావతి, విజయలక్ష్మిలతో మంగళవారం స్థానిక రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రస్తుతం పంట పిలక దశ నుంచి పొట్ట దశకు చేరుకుం టుందన్నారు. అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో అగ్గి తెగులు విపరీతంగా ఆశించి పంటలు ఎండి మచ్చలు ఏర్పడు తున్నాయన్నారు. తెగులు నివారణకు సుడోమోనాస్ ఒక కిలో చొప్పున 200 లీటర్ల. నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ట్రై సైక్లోజోల్ 120 గ్రాముల చొప్పున ఎకరానికి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పదని స్థానిక తహసిల్దార్ సిహెచ్ నాగమ్మ హెచ్చరించారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇసుక తరలించే వాహనదారులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. స్థానిక రెవెన్యూ శాఖ అధికారుల అనుమతితోనే ఇసుక రవాణా చేసుకోవాలని, ఇష్టానుసారంగా తవ్వకాలు చేసి ఇసుక తరలిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో హెచ్‌డిటి, ఆర్ఐ హరికృష్ణ, విఆర్ఓ ఝాన్సీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టులపై నిరసన ర్యాలీ

ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి-విఆర్.పురం

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మండల కేంద్రం రేఖపల్లి రేకపల్లి జంక్షన్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సున్నం రంగమ్మ, మండల కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయి అధికారులకు ముందుగానే సమాచారం ఇచ్చి శాంతియుత ఆందోళనకు విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటే వేతనాలు అదనంగా ఇస్తామని ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచుతారని నాలుగున్నరేళ్లగా ఎదురు చూస్తున్న అంగన్వాడీలకు తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. అంగన్వాడీ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు ఏమి కోరడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నామని చెప్పారు. సుప్రీం తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, అన్ని రకాల యాప్‌లు రద్దు చేసి, ఏదైనా ఒక యాప్‌ను మాత్రమే తీసుకురావాలని కోంరు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ప్రమోషన్ ఇచ్చి మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా చేపట్టే నిరసన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా అక్రమ అరెస్టులకు పాల్పడి నియంత పాలనను చూపిస్తున్నారని విమర్శించారు. ఈ పోరాటాన్ని చూసైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, అంగన్వాడి కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభులత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు కనకమహాలక్ష్మి. కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై వినతి

పాడేరు : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు నాయకులు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం చింతపల్లి తహసిల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడి కార్యకర్తలు, మినీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ వేతనంతో వెట్టిచాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటిని అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లను ప్రమోషన్లు, పెండింగ్ బిల్లులు, తదితర సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా నాయకులు పెంటమ్మ, నీలమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు, అంగన్‌వాడీలు

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు

ద్విచక్ర వాహనంపై నాలుగు కేజీల గంజాయి తీసుకెళ్తున్న ముగ్గురు వ్యక్తులను మంప పోలీసులు మండలంలోని బూదరాళ్ల గ్రామ సమీపంలో మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాలు ప్రకారం... గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు బూదరాళ్ళ గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తూ ఉండగా, ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, వారిని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న నాలుగు కేజీల గంజాయిని, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కొత్తపేట గ్రామానికి చెందిన జనపాటి శివ కార్తీక్, తలాటం సత్యనారాయణమూర్తి, నిమ్మపాడు గ్రామానికి చెందిన గొల్లూరు కామేశ్వరరావును అరెస్టు చేశారు. ఒడిశా నుండి పప్పర్లమెట్ట గ్రామం నుండి ఈ గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసింది. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

రోగుల ఆరోగ్య సమాచారం సిద్ధం చేయండి

జగనన్న సురక్ష వైద్యశిబిరంలో నిపుణులతో వైద్యసేవలు

అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా వైద్యానికి రోగుల హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని దిగువ మోదాపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో పైలెట్ ప్రాజెక్ట్‌గా నిర్వహించిన . జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల సూచనల మేరకు మందులు వాడి, ఆరోగ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు.

1ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అక్టోబర్ ఒకటి నుంచి నిర్వహించే జగనన్న సురక్ష వైద్యశిబిరాలకు అవసరమైన వైద్యనిపుణులను కేటాయించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి రప్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా కంటి వైద్య నిపుణులు, గైనకాలజిస్ట్, ఆర్థోపెడీషియన్, కార్డియాలజిస్ట్‌లు, జనరల్‌మెడిసిన్ వైద్యులు ఉండాలని,అలాగే అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులందరికీ హెచ్‌బి, బిపి, సుగర్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. పాజిటివ్‌గా వస్తే రోగులకు సమస్యను వివరించి, క్రమం తప్పకుండా మందులు వాడే విధంగా ఆశ వర్కర్‌కు సూచనలు జారీ చేయాలని ఆదేశించారు. వ్యాధిని బట్టి కేటగిరీ వారిగా హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వైద్యశిబిరాలకు స్పెషలిస్ట్ వైద్యులను మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బిపి రోగితో మాట్లాడి, తగు సూచనలు చేశారు, మానసిక ఎదుగుదల లేకపోవడంతోపాటు ఫిట్స్‌తో బాధపడుతున్న నాలుగేళ్ల రోహిత్ అనే బాలుడికి అవసరమైన వైద్యసేవలు అందించాలని వైద్యులను సూచించారు. రోహిత్‌కు వికలాంగ పింఛను మంజూరు చేస్తామన్నారు.

బాలుర పాఠశాలలో సౌకర్యాల కల్పనకు చర్యలు

గిరిబాలల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని డి మోదాపుట్టు గిరిజన సంక్షేమ బాలురు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. మంగళవారంపాఠశాలను సందర్శించి, అక్కడి సౌకర్యాలపైఆరా తీశారు. వంటగది చిన్నదిగా ఉండడం, భోజనాలకు విద్యార్థులు ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించారు. వర్షం వస్తే భోజనాలకు పిల్లలు పడే ఇబ్బందులను ఉపాధ్యాయులు విన్నవించారు.. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ రన్నింగ్ వాటర్ లేక ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి తేగా, నీటి సదుపాయం ఏర్పాటుకు అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు. అలాగే భోజనాల గది నిర్మాణానికి అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు.కార్యక్రమంలోజగనన్న సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమేష్ బాబు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ సి. జమాల్‌భాషా, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ కృష్ణారావు, టిబి నియంత్రణాదికారి డా. విశ్వేశ్వర నాయుడు, డిఎల్‌డిఒ, ఎటి.డబ్ల్యుఒ రజని, స్థానిక సర్పంచ్ ఎల్.చిట్టిబాబు, ఎంపిటిసి కె.నరసింహమూర్తి, ఎఎంసి చైర్మన్ కె.సూరిబాబు,డైరెక్టర్ జి రాజారావు పాల్గొన్నారు.

కెజిహెచ్‌కు ఐటిడిఎ నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-పాడేరు: వైద్యం కోసం గిరిజనులను రెఫెరల్ చేసే విశాఖ కేజీహెచ్ కు ఐటిడిఏ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.అల్లూరి జిల్లా ఆదివాసులు అనారోగ్యంతో పాడేరు జిల్లా ఆసుపత్రి, నర్సీపట్నం ఆసుపత్రులకు వస్తారని వీరికి మెరుగైన వైద్యం అందించేందుకు విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆస్పత్రికి రిఫరల్ చేస్తుంటారని తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో లేని ఇతర టెస్టులు, మెడిసిన్ అందించడం కోసం ఎంత డబ్బైన పాడేరు ఐటీడీఏ నుండి చెల్లించాలని తెలిపారు.

నేడు పెదబయలులో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-పాడేరు: పెదబయలులో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్నిఈనెల 27 వ తేదీ బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదబయలు ఎంపిడిఓ కార్యాల యంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగు తుందన్నారు. అనంతరం శాఖాధికారులు, సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందితో సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-పెదబయలు రూరల్: మండల కేంద్రంలో ఐటిడిఎ భవనం వద్ద ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యవర్గం ప్రత్యేక కమిటీ సభ్యుడు చెండ లోహిదాస్ అధ్యక్షతలో మంగళవారం ఎన్నికైంది. 30 మందితో కమిటీ ఎన్నుకున్నారు.మండల అధ్యక్షులుగా జంబు దేవరాజు, మండల కార్యదర్శిగా కిముడు సంజీవ బాబు, కోశాధికారిగా ఆనంద్ ఉపాధ్యక్షులుగా కృష్ణబాబు, కోడ సోమేష్, సహాయ కార్యదర్శులుగా కూడా నర్సింగరావు, కొమ్మ కొండబాబు, ప్రచార కమిటీ సభ్యులుగా కిముడు వెంకటరావు, చిరంజీవి, మహిళ సంఘం అధ్యక్షురాలుగా తైజ, మండల కార్యదర్శిగా గబుడ సావిత్రి, ఉపాధ్యక్షురాలుగా మల్లీశ్వరి, శకుంతల, సహాయక కార్యదర్శులుగా లక్ష్మి, చెట్టి రాములమ్మ, కమిటీ సభ్యులుగా పలాసి మత్స్యలింగం, మఠం మహేష్, అప్పారావు, పద్మ సత్యవతి, లలిత ఎన్నుకున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు : మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఈ నెల 27తో ముగియ నుండడంతో పోలీసులు అప్రమత్త మయ్యారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జీకే.వీధి మండలం సీలేరులో మంగళవారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాన కూడళ్లలో సిఆర్‌పిఎఫ్ పోలీసులు మోహరించి గస్తీ ముమ్మరం చేశారు. ఏఓబి సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలను స్థానిక ఏపీ జెన్కో చెక్‌పోస్టు వద్ద నిలిపివేసి స్థానిక ఎస్సై రామకృష్ణ ముమ్మరంగా తనిఖీలు చేసి వాహన పత్రాలను పరిశీలించారు. మావోయిస్టులకు సహకరించే సానుభూతిపరులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాన కూడళ్లు, స్థానిక జల విద్యుత్ కేంద్రం రిజర్వాయర్లకు మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవడానికైనా పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలతో ప్రధాన రహదారులు, కల్వర్టుల వద్ద తనిఖీలు చేపట్టారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన స్థానిక హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులని ఆదేశించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, కార్యదర్శి పాల్గొన్నారు.

గిరి'జన గళం' గంగరాజు

- జెడ్‌పిటిసిగా ప్రజా ప్రస్థానంలో రెండేళ్లు
- సమస్యల పరిష్కారం..సౌకర్యాల కల్పనకు కృషి
- పోరాటపంథాలోనే నిరంతరం ముందడుగు
- సిపిఎం జెండా నీడన ప్రజాసేవకు కంకణం

పార్టీ ముఖ్యనేతలు, శ్రేణులతో గంగరాజు విజయోత్సవ ర్యాలీ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - అనంతగిరి : గిరిజన సమస్యలపై గళం విప్పే ప్రజా పోరాట యోధుడిగా దీసరి గంగరాజు ప్రజాప్రస్థానం విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఏజెన్సీవాసిగా నిరంతరం గిరిజనం మధ్యే ఉంటూ, సిపిఎం అండదండలతో వారి సమస్య పరిష్కారం, కనీస సౌకర్యాల కల్పనకు చూపిస్తున్న చొరవ, కృషితో గంగరాజును గడచిన జిల్లా ప్రాదేశిక ఎన్నికల్లో అనంతగిరి జెడ్‌పిటిసిగా అఖండ మెజార్టీతో ప్రజలు గెలిపించారు. మన్యవాసులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తూ, జెడ్‌పిటిసిగా రెండేళ్లు పదవీకాలం పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం.



ప్రజాసమస్యలే ఎజెండాగా సిపిఎం జెండా పట్టుకుని నిరంతరం పోరాటం చేసే దీసరి గంగరాజును గడచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతగిరి మండల ప్రాదేశికం నుంచి జెడ్‌పిటిసిగా మంచి మెజార్టీతో గెలిపించారు. సెప్టెంబర్ 25నాటికి జెడ్‌పిటిసిగా రెండు వసంతాలు పూర్తిచేసుకున్న గంగరాజు, గడచిన రెండేళ్లలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ,వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.తనను గెలిపించిన అనంతగిరి మండలవాసుల సమస్యలే కాకుండా అల్లూరి జిల్లాలో గిరిజనం సమస్యలపై అటు జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ, ఇటు ఐటిడిఎ పాలకమండలి, మండల పరిషత్ సమావేశాల్లో ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి అధికారులను వేడుకోవడంతోపాటు అవసరమైతే వారిపై ఒత్తిడి చేయడం, మించితే పోరాటం చేసైనా సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగిపోతున్నారు. గిరిజన గ్రామాలను సందరిస్తూ, వారి సమస్యలను తెలుసుకోవడం, వాటిని అధికారులు, నేతల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే ఏకైక లక్ష్యంగా కృషి చేస్తున్నారు. గిరిజనులకు వెన్నుదన్నుగా ఉండడంతోపాటు, సిపిఎం పక్షాన వారి అండదండలతో ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

అల్లూరి జిల్లా ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో నిత్యం పర్యటిస్తూ, అక్కడి ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకోవడం, వారికి అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటిని సాధించడమే లక్ష్యంగా అలుపెరుగని పోరాటం సాగిస్తున్న గంగరాజు, ప్రజలిచ్చిన తీర్పుకు అనుగుణంగా పనిచేస్తూ, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా ముందుకు సాగిపోతున్నాడు. తనను నమ్మి గెలిపించిన తోటి గిరిజనులకు వీలైనంత ఎక్కువ సేవ చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. రానున్న మూడేళ్లలో మరింతగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేయనున్నట్లు గంగరాజు స్పష్టం చేశారు

తాగునీటి సమస్యపై మహిళలతో ఆందోళనలో గంగరాజు (ఫైల్‌ఫోటో)

రెండేళ్లలో గణనీయమైన అభివృద్ధి

జెడ్‌పిటిసిగా రెండేళ్లు పూర్తిచేసుకున్న గంగరాజు, మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు గణనీయమైన కృషి చేశారు. పాడేరు కనెక్టివిటీ గ్రాంట్‌తో మండలంలో రూ.కోట్లాది నిధులతో 90కి పైగా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పనకు చొరవ చూపారు. లొంగపర్తి పంచాయతీ మెట్టుమవలస నుంచి ఒనుకొండవరకు వాలసి పంచాయతీ. జెండాకారం నుంచి ఊటగడ్డ వరకు, బుడ్డపుట్టు నుంచి సీమగడ్డ, పుట్టపాడు. లొంగపర్తి వాలసీ పంచాయతీ సరిహద్దు గ్రామాలైన లుంగపర్తి నుంచి దిగువపట్టి, ఎగువపట్టి, కరకవలస మీదుగా సీడివలస వరకు అలాగే సీడివలస నుంచి కివర్ల పంచాయతీ బొంగీజా, గుమ్మ పంచాయతీ నుంచి నిమ్మఊట మీదుగా. కడరేవు వరకు ఇలా అనంతగిరి మండలంలోని అనేక పంచాయతీ గ్రామాలకు రోడ్లు మంజూరుకు గంగరాజు కృషి చేశారు.

రూ.30 లక్షలతో తాగునీరు, డ్రైనేజీ సౌకర్యం

జెడ్‌పిటిసిగా రెండేళ్లలో రూ.30లక్షల జిల్లా పరిషత్ నిధులతో మండలపరిధిలోని గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి గంగరాజు కృషి చేశారు. తాగునీరు, డ్రైనేజీ, సిసిరోడ్లు పనులకు జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యునిగా తనకు కేటాయించిన కోటా నిధులను వినియోగించినట్లు గంగరాజు తెలిపారు.మారుమూలగ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయడం, వాటిని అధికారులు, నేతల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేయడం, అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టడం ఇదే నిత్యకృత్యంగా పనిచేస్తూ, నిజమైన ప్రజాపోరాటయోధుడిగా గిరిజనం నుంచి అభినందనలు, ప్రశంసలు అందుకుంటున్నారు. సిపిఎం అండదండలతోనే తాను నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, వారి అభివృద్ధి, ప్రయోజనాలకు పాటుపడడం గర్వంగా ఉందని గంగరాజు అంటున్నారు.

కోతుల గుంపు స్వైరవిహారం

- బెంబేలెత్తిపోతున్న సీలేరు వాసులు
- అదుపుచేసే చర్యలు చేపట్టాలని వినతి

రేకుల ఇంటిపై తిష్టవేసి కూర్చున్న కోతుల గుంపు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో వానరమూకలు హల్‌చల్ చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ, ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. జనవాసాల్లో సంచరిస్తూ, ఇళ్లల్లోకి చొరబడి ఆహార పదార్థాలు, వస్తువులు పట్టుకుపోవడమే కాకుండా, మహిళలపై దాడిచేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. కోతులు గుంపలుగా సంచరిస్తూ అలజడి సృష్టిస్తుండడంతో ఆందోళన చెందుతున్న స్థానికులు, వాటి నివారణతోపాటు వాటి నుంచి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కాగా గతంలో కోతుల గుంపు నివారణకు జెన్‌కో సామాజిక బాధ్యతలో భాగంగా చర్యలు చేపట్టింది. 2004లో కొండముచ్చును ఏర్పాటుచేసి, దాన్ని గ్రామంలో తిప్పేందుకు ఒక మనిషిని ఏర్పాటు చేయడం ద్వారా కొండముచ్చును చూసి కోతులు భయపడి ఊరు వదిలే వెళ్లిపోయేలా చర్యలు చేపట్టారు. అదేవిధంగా భీమడోలు నుంచి కోతులు పట్టే వారిని తీసుకువచ్చి, బోనులు ఏర్పాటు చేసి అందులో కోతులు వెళ్లాలా చేసి, వాటిని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విడిచిపెట్టారు.

అయితే గడచిన మూడేళ్లుగా కోతుల నివారణ, నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో మళ్లీ గ్రామంలోకి చొరబడి స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కోతుల నివారణకు గతంలో మాదిరిగా జెన్‌కో అధికారులు సామాజిక బాధ్యతగా చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు. గ్రామ పంచాయతీ, అటవీశాఖ అధికారులు కూడా దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కోట్లు ఖర్చయినా తాగునీటికి కటకట

దిష్టిబొమ్మలా రక్షితనీటి పథకాలు

కుళాయిల్లో చుక్కనీరైనా రాని దుస్థితి

నీటిఎద్దడితో అల్లాడుతున్న గిరిజనం

నిరుపయోగంగా ఉన్న రక్షితనీటి పథకం ట్యాంకు

ప్రజాశక్తి -చింతూరు : పనుల్లో నాణ్యతాలోపం, నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వెరశి.. కోట్లు ఖర్చయినా మన్యవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. నీటిపథకాలను నిర్మించేశాం.. తమ పని పూర్తయిందన్నట్లు సంబంధిత అధికారులు పట్టించుకోకుండా వదిలేయడంతో వేసవిలోనే కాదు.. అన్ని సీజన్లలోనూ గిరిజనులు దాహార్తితో అల్లాడిపోయే పరిస్థితి ఉంది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కలుషితనీటిని వాడుతూ రోగాల పాలౌతున్నా ప్రభుత్వం, పాలకుల్లో ఇసుమంతైనా చలనం లేకపోవడంతో ఆందోళన వ్యక్తమౌతోంది.

చింతూరు డివిజన్ కేంద్రంలోని ఎర్రంపేట గ్రామంలో నాబార్డ్ ఆర్ఐడిఎఫ్-24 నిధులు రూ.14కోట్లతో నిర్మించిన రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని .2022 మార్చి 19న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. శబరి నదిలో ఇంటెక్ వెల్ ఏర్పాటు చేసి, పైపుల ద్వారా ఎర్రంపేటలోని ఓవర్ హెడ్ టాంక్‌లోకి శబరి జలాలను మళ్లించి, వాటిని శుద్ధిచేసి, మండలంలోని 20 గ్రామాల్లోని నీటి ట్యాంకులకు సరఫరా చేయడంద్వారా ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నది పథకం లక్ష్యం. అయితే, ఈ పథకానికి సంబంధించి పైపులైన్ల ఏర్పాటులో నిర్లక్ష్యం, నీటి ఒత్తిడిని తట్టుకునేలా ఏర్పాటు చేయకపోవడంతో, ఎక్కడికక్కడే లీకేజీలు ఏర్పడి, గ్రామాల్లోని ట్యాంకులకు పూర్తిస్థాయిలో తాగునీరు చేరని పరిస్థితి నెలకొంది.

నీటిపథకాన్ని ప్రారంభిస్తూ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆవిష్కరించిన శిలాఫలకం

ఇదే క్రమంలో చింతూరు మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన 90 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకునకు నీరు అందకపోవడంతో, దాని పరిధిలోని గ్రామాల్లో కుళాయిలకు నీరు అందని స్థితి ఉంది. పైపులైన్ల జాయింట్ల నీరు పైకి ఎగజిమ్మి ట్యాంకు చేరకుండా వృథాగా పోతోంది. దీంతో మండల కేంద్రంలోని బిసి.కాలనీ, గుభేలుపేట, గొల్ల బజార్ కాలనీలకు కుళాయి నీరు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు నీరు లేక వృథాగా ఉంది. మన్య వాసులకు తాగునీరు అందించాలని ప్రభుత్వం కోట్లాది రుపాయలు ఖర్చుచేస్తున్నా, నీటి పథకాల నిర్మాణం, నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల గిరిజనులకు తాగునీరు అందకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటర్ ట్యాంకులకు పైకప్పులు లేకపోవడంతో పక్షులు ఇతర కీటకాలు రెట్టలు వేయడంతో పాటు ట్యాంకులో పడుతున్నాయి. ట్యాంకు లోపల పేరుకు పోయిన నాచు ఇతర వ్యర్థాలను తొలగించే పరిస్థితి కూడా లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద నీటిని శుద్ధిచేసే ట్యాంకు

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ నిరసన

రంపచోడవరంలో దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-రంపచోడవరం : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా, దేవీపట్నం మండల ఎస్‌సి సంఘాల నాయకులు దీక్షలను చేపట్టారు. బాబుతో మేము సైతం అంటూ ఈ దీక్షలను మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజవకర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

1ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక , ఓటమి భయంతో, రాజకీయ కక్షతోనే అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో 2 లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి పొందారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, మరిసెట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, జెఎస్.నగేష్, గొర్లె సునీత, అడబాల బాపిరాజు, గొల్లా చంటిబాబు, తైలం గంగాధరరావు, వై నిరంజనిదేవి, తీగల ప్రభ, దిడ్డి జనార్ధన్, ముచ్చుచిన్ని, దాకారపు సత్యనారాయణ,పెనుమాకల రత్నం, ధారా వెంకన్న, సిద్దా వెంకన్న దొర, కీర్తి గంగరాజు,, కర్రి రాజీవ్, బొడ్డేటి వీరబాబు, మడకం పండు దొర, పెదకాపు, పత్తి సుబ్బారావు, దేవీపట్నం మండల ఎస్‌సి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలికే వరకూ పోరాటాలు చేస్తామని పాడేరు నియోజకవర్గ టిడిపి పరిశీలకులు రాజమండ్రి నారాయణ స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునే విధంగా ఉందని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ కు నిరసనగా పాడేరులో మంగళవారం 14వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు విడుదల అయ్యే వరకూ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొబ్బి రాము, బుద్ధ జ్యోతి కిరణ్, గబ్బాడ సింహాచలం, కోడ వెంకట సురేష్ కుమార్, గంగ పూజారి శివకుమార్, డిప్పల కుమారి, దప్పోడి వెంకటరమణ, బర్సింగి శ్రీనివాసరావు, బాబురావు పాడల్, రమేష్ నాయుడు, కిముడు సింహాచలం, కళావతి, ఉమా కుమారి, మత్స్య కొండమ్మ, లక్ష్మణరావు, రమణమూర్తి, చిన్నారావు, రాజబాబు, కొండబాబు, శ్రీను, బొజ్జన్న, సుభద్రమ్మ, పద్మ, కొండబాబు, వెంకట్రావు, మత్స్యరాజు, పద్మ, రాధాకృష్ణ, సురేష్ కుమార్, కెవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో రిలే దీక్షల్లో పాల్గొన్న నారాయణ, ఇతర నేతలు

నేడు జైపూర్ 'రగ్ ఉత్సవ్ 2023' ప్రారంభం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం): దేశంలో హ్యాండ్‌మేడ్ రగ్గుల తయారీలో ప్రఖ్యాతి గాంచిన జైపూర్ రగ్స్ వార్షిక 'రగ్ ఉత్సవ్ 2023' ను ఈనెల 27న దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో ప్రారంభించనున్నట్లు జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, .ఈ రగ్ ఉత్సవ్‌లో ధుర్రీస్, హ్యాండ్ టఫ్టెడ్, హ్యాండ్లూమ్ అండ్ హ్యాండ్ నాటెడ్, మంచాహ్ కలెక్షన్‌పై ప్రత్యేక తగ్గింపులు, నేత కార్మికులతో ఇంటరాక్టివ్ సెషన్‌లు, జెఆర్ మెరిటోరియస్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంలు ఉన్నాయన్నారు. విభిన్న రగ్ కేటగిరీలలో కస్టమర్లకు 10 నుంచి 80 శాతం వరకు తగ్గింపు ఉంటుందన్నారు.,బోర్డు పరీక్షలలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు. ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.మరింత సమాచారం కోసం www.jaipurrugs.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

భువనేశ్వరిని కలిసిన గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి -పాడేరు టౌన్: టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని క్యాంప్ సైట్‌లో ఉంటున్న ఆయన సతీమణి నారా భువనేశ్వరిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కలిశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే చంద్రబాబు బయటికి వస్తారని నేతలు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని భువనేశ్వరి చెప్పారన్నారు.

భువనేశ్వరితో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

రోడ్లపై పశువుల సంచారంతో ఇక్కట్లు

రాత్రి వేళ రోడ్లపై తిష్ట వేసిన పశువులు

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం సీలేరులో పశువులను విచ్చలవిడిగా రోడ్లపైనే వదిలేయడంతో స్థానికులు ముఖ్యంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకందారులు వాటిని యథేచ్ఛగా వదిలేయడంతో రేయింబవళ్లు రోడ్లపైనే సంచరిస్తూ, ఎక్కడికక్కడే గుంపులుగా తిష్టవేసి పడుకుంటుండడంతో వాహనదారులు అగచాట్లు పడుతున్నారు ముఖ్యంగా మార్కెట్ రోడ్‌లో, మెయిన్‌బజారులో రోడ్లపైనే ఉండడం, పాదచారులు, వాహనదారులకు దారి ఇవ్వకుండా అడ్డంగా నిల్చుండడంతో అవస్థలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. మార్కెట్‌కు సరుకులు కొనేందుకు వచ్చిన వారు, జల విద్యుత్ కేంద్రంలో నైట్‌షిఫ్ట్ డ్యూటీలకు వెళ్లేవారు రోడ్డుపైనే తిష్టవేసిన పశువుల గుంపులతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులు, పంచాయతీ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. యజమానులు పశువులను విచ్చలవిడిగా రోడ్లపైనే వదిలేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. రోడ్లపైనే, ఆరుబయట సంచరిస్తున్న పశువులు ఎక్కడికక్కడే పేడ, మూత్రాలను పోస్తుండడంతో రోడ్లు అధ్వానంగా తయారౌతున్నాయని వాపోతున్నారు.

కాగా దీనిపై స్పందించిన స్థానిక ఎస్ఐ రామకృష్ణ, పశువులను ఆరుబయట విడిచిపెడితే చర్యలు తప్పవని యజమానులకు పలుమార్లు హెచ్చరించారు. అయినా పెంపకందారుల నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో పశువులు రోడ్లపై సంచరించకుండా యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను అలాగే ఎస్ఐ రామకృష్ణకు ఎపి జెన్‌కో ఉద్యోగులతోపాటు స్థానికులు వేడుకుంటున్నారు. ఎస్సై రామకష్ణ పశుఏపీ జెన్కో ఉద్యోగులు స్థానికులు కోరారు.